సాక్షి తూర్పుగోదావరి

శనివారం । 28 । జూన్ । 2025



వందనానికి వంకలా!

కూటమి ప్రభుత్వం తమ పిల్లలకు 'తల్లికి వందనం' పథకాన్ని వర్తింపజేయకపోవడంపై అంగన్‌వాడీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


8లో



రోడ్డు ప్రమాదంలో ర్యాలి వాసి మృతి

అనకాపల్లి జిల్లా కశింకోట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన వ్యాన్ డ్రైవర్, మహిళ దుర్మరణం పాలయ్యారు.

డెల్టాలకు 10,500 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 10,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3 వేలు, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.90 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల్లో గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ బీవీ తిరుపాణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ బయోడేటాను వచ్చే నెల 3వ తేదీలోగా అందజేయ్యాలన్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టుల్లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు జూలై 4వ తేదీ ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని వివరించారు. ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, కామర్స్ అభ్యర్థులకు జూలై 7వ తేదీ ఉదయం 11 గంటలకు ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. ఇతర వివరాలకు 97014 35136 మొబైల్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలనకు 144 మంది హాజరు

రాజమహేంద్రవరం రూరల్: పాలిటెక్నిక్ కోర్సులలో ప్రవేశానికి బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం జరిగిన సర్టిఫికెట్ల పరిశీలనకు 144 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు తెలిపారు. శనివారం 1,20,001 నుంచి చివరి ర్యాంకు వరకూ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందన్నారు. అలాగే, 50,001 ర్యాంకు నుంచి 90,000 వరకూ అభ్యర్థులు పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చన్నారు.

ఆశ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తులు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో 30 ఆశ కార్యకర్తలు పోస్టుల భర్తీ కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు శుక్రవారం ప్రకటనలో కోరారు. వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరిధిలోని మండలాలకు సంబంధించి అనపర్తి-3, బిక్కవోలు-1, రంగంపేట-2, రాజమహేంద్రవరం రూరల్-4, కడియం-3, రాజానగరం-2, కోరుకొండ-2, సీతానగరం- 2, గోకవరం-1, దేవరపల్లి-3, నల్లజర్ల-2, తాళ్లపూడి-1, కొవ్వూరు రూరల్-1, చాగల్లు-1, పెరవలి-1, ఉండ్రాజవరం-1 ఒక్కటి ఉన్నాయన్నారు. శనివారం నుంచి జూలై ఐదో తేదీ వరకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ప్రక్రియ, అర్హతల వివరాలను బొమ్మూరులోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలోనూ, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఈస్ట్‌గోదావరి.ఎన్‌ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు.

4న జేఎన్‌టీయూకే స్నాతకోత్సవం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ-కాకినాడ 11వ స్నాతకోత్సవం వచ్చే నెల 4న నిర్వహిస్తున్నట్లు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సీఎస్ ఆర్‌కే ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ముఖ్య అతిథిగా వర్సిటీ చాన్సలర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరవుతారన్నారు.

వంచనపై.. జనం బాట

- చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం
- హామీలు నెరవేర్చే వరకూ వారి పక్షాన పోరాటం
- ప్రతిపక్షం ప్రశ్నిస్తే గొంతు నొక్కుతున్నారు
- కూటమి తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదు
- ఏదైనా ప్రజా క్షేత్రంలో తేల్చుకుంటాం
- 3 దశల్లో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ'
- జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ. చిత్రంలో పార్టీ నేతలు

సాక్షి, రాజమహేంద్రవరం/రాజమహేంద్రవరం రూరల్: 'సార్వత్రిక ఎన్నికల్లో నెగ్గేందుకు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపించింది. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేస్తోంది. చంద్రబాబు చేస్తున్న దగాను క్షేత్ర స్థాయిలో ప్రజల వద్దకు తీసుకెళ్దాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని పోరాటం చేద్దాం' అంటూ వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం రూరల్ కాతేరులో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ నేతృత్వంలో శుక్రవారం జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా భారీ సంఖ్యలో తరలి వచ్చిన కార్యకర్తలు, నేతలు, అభిమానులనుద్దేశించి ముఖ్య అతిథిగా హాజరైన బొత్స ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం సక్రమంగా వ్యవహరించకపోతే ప్రజల పక్షాన పోరాడాల్సిన బాధ్యత ప్రతిపక్షంగా తమపై ఉందని అన్నారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇదే బాధ్యత తీసుకుని పోరాడుతున్నారన్నారు. సూపర్ సిక్స్ కూడా సక్రమంగా అమలు చేయకపోయినా, ఇచ్చిన హామీలన్నీ అమలు చేసినట్లు చంద్రబాబు మాట్లాడటం దారుణమని మండిపడ్డారు. హామీలు ఎక్కడ నిలబెట్టుకున్నారని జనంలోకి వెళ్లి అడుగుతామన్నారు. ఇందులో భాగంగానే 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' పేరిట ప్రత్యేక కార్యక్రమం ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమం మూడంచెల్లో జరుగుతుందని, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించి చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని అన్నారు. ఈ సమావేశంలో 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' క్యూఆర్ కోడ్ డాక్యుమెంట్ చూపించారు. చంద్రబాబు ఇచ్చిన బాండ్లు, మాజీ సీఎం జగన్ ఇచ్చిన పథకాలను కూటమి సర్కారు ఎలా ఎగ్గొడుతోంది, చంద్రబాబు మోసాలతో ప్రజలకు ఎంత నష్టం వాటిల్లిందనే అంశాలను వివరించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, మాజీ ఎమ్మెల్సీ కోడూరు శివరామకృష్ణ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరిజాల వీర్రాజు (బాబు), వైఎస్సార్ సీపీ నేత మేడా గురుదత్ ప్రసాద్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కంతమని రమేష్, రాష్ట్ర తెలుకుల, గాండ్ల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ సంకిన భవానీప్రియ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

బాబు వచ్చినా జాబు వచ్చిందా?



జాబు రావాలంటే బాబు రావాలని 2014 ఎన్నికల్లో ఊదరగొట్టారు. బాబు వచ్చినా జాబు మాత్రం రాలేదు. నమ్మి ఓట్లేసి గెలిపిస్తే ఏ ఒక్కరికీ ఒక్క జాబూ ఇవ్వలేదు. 2024 ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' అని మరోసారి నిరూపించింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు అందించారు. బాబు మోసాలపై ప్రతి ఇంటికీ వెళ్లి వివరిద్దాం. 2029లో మళ్లీ జగన్‌ను సీఎంను చేద్దాం.

– మార్గాని భరత్‌రామ్, మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

జగన్‌ను విమర్శించే స్థాయి ఉందా?



సరిగ్గా కాలు కూడా కదపలేని కూటమి నాయకుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌ను ఏదో చేస్తానని అంటున్నాడు. వయస్సుకు తగ్గ మాటలు మాట్లాడాలి. ముందు నుంచీ చంద్రబాబు మోసమే. పిల్లనిచ్చిన మామను వెన్నుపోటు పొడిచారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన రెండుసార్లు ప్రజలను మోసం చేశారు. వైఎస్సార్ సీపీలో ఏ కార్యకర్తకు కష్టమొచ్చినా జక్కంపూడి కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. వైఎస్ జగన్ దేవుడిచ్చిన బిడ్డ. ఆ తర్వాతే రాజా, గణేష్.

– జక్కంపూడి విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకురాలు

మాట మీద నిలబడే వ్యక్తి జగన్



ప్రజలకు మాటిస్తే నిలబడే వ్యక్తి మాజీ సీఎం వైఎస్ జగన్. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలతో పాటు, ఇవ్వనివి సైతం అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుంది. తిరిగి జగన్ సీఎంగా రావాలని ప్రజలు కోరుకుంటున్నారు. చంద్రబాబు అబద్ధాలతో ప్రజలు మోసపోయారు. చంద్రబాబు మోసాలను కార్యకర్తలు సమష్టిగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలి.

– తిప్పల గురుమూర్తిరెడ్డి, వైఎస్సార్ సీపీ రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు

రానున్నది కార్యకర్తల ప్రభుత్వం



2029లో రానున్నది వైఎస్సార్ సీపీ కార్యకర్తల ప్రభుత్వం. కార్యకర్తల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ అధిక ప్రాధాన్యం ఇస్తుంది. కార్యకర్తలకు గ్రూప్ ఇన్సూరెన్స్, శిక్షణ తరగతులు, సభ్యత్వ నమోదు చేయాలన్న ఆలోచనలో పార్టీ ఉంది. రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం ద్వారా ప్రజల్లో కార్యకర్తలు మమేకం కావాలి.

– డాక్టర్ గూడూరి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి

చంద్రబాబు అంతా మోసం



అబద్ధపు హామీలతో చంద్రబాబు అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేశారు. విద్యార్థులు, రైతులు, మహిళలు ఇలా అన్ని వర్గాలనూ కూటమి ప్రభుత్వం మోసం చేసింది. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండానే చేసినట్లు ప్రచారం చేస్తున్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ పాలనలో డీబీటీ ద్వారా రూ.4,65,000 కోట్లు ప్రజలకు అందించారు.

– తలారి వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ కో ఆర్డినేటర్

బాబు మాట నిలబెట్టుకోవాలి



కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైంది. హనీమూన్ పీరియడ్ అయిపోయింది. ఏడాదైనా సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడం లేదు. మరుపు మానవ సహజం. మర్చిపోతున్న చంద్రబాబుకు హామీలు అమలు చేయమని గుర్తు చేయాలి. అందుకు మండల స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకూ ప్రతి ఇంటికీ చంద్రబాబు మోసాలను తీసుకెళ్లాలి.

– డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, అనపర్తి

వెన్నుపోటు దినం ఫలితమే తల్లికి వందనం



కూటమి ప్రభుత్వ వైఫల్యాలను గుర్తు చేస్తూ వైఎస్సార్ సీపీ చేపట్టిన వెన్నుపోటు దినం ఆందోళన ఫలితంగానే తల్లికి వందనం పథకం అమలు చేశారు. ప్రతి పథకంలోనూ కూటమి ప్రభుత్వం కోతలు విధించింది. ఈ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. రాబోయే ఎన్నికల్లో జిల్లాలోని ఏడు స్థానాలూ గెలిచి తీరుతాం.

– జి.శ్రీనివాసనాయుడు, మాజీ ఎమ్మెల్యే, నిడదవోలు

షణ్ముఖ వ్యూహం విఫలం



మాజీ సీఎం వైఎస్ జగన్‌ను ఓడించలేమనే భయంతోనే చంద్రబాబు కూటమి కట్టారు. అందమైన అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చారు. షణ్ముఖ వ్యూహం పేరుతో కూటమి పార్టీలు హామీలిచ్చాయి. 50 ఏళ్లు నిండిన ఎస్సీ, బీసీలకు పింఛను వంటి నోటికొచ్చిన హామీలు గుప్పించారు. ఇస్తానన్న సూపర్ సిక్స్ పథకాలే ఇవ్వడం లేదు. ప్రతిపక్షం నోరెత్తకుండా బెదిరింపు ధోరణి అవలంబిస్తున్నారు. అందుకే 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' పేరుతో ప్రజల్లోకి వెళుతున్నాం. బాబు హామీలపై ప్రజల పక్షాన ప్రశ్నిస్తాం. అమలు చేసే వరకూ పోరాటాలు ఉధృతం చేస్తాం.

– కురసాల కన్నబాబు, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్

మోసం చేసి అధికారం



ఎన్నికల ముందు ఎన్నో హామీలు గుప్పించి, అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబు తీరును ఎండగడతాం. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అసత్య ప్రచారం చేసి, ప్రజలను మోసం చేసి, కూటమి అధికారంలోకి వచ్చింది. ఏడాది పాలనలోనే ఈ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. బాబు మోసాలను జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకూ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రచారం చేస్తాం. ఇందుకు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలి.

– చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

అన్ని వర్గాలకూ వెన్నుపోటు



సూపర్ సిక్స్ పేరిట అడ్డగోలు హామీలు గుప్పించి, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. వాటిని అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలకూ వెన్నుపోటు పొడిచింది. శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణకు జిల్లా రాజకీయాలపై అవగాహన ఉంది. ఆయన రాకతో ప్రతి సామాన్య కార్యకర్తకూ ధైర్యం వచ్చింది. ఆయన చూపిన మార్గంలో చంద్రబాబు మోసాలను గ్రామ స్థాయిలో ప్రతి ఇంటికీ తీసుకెళ్తాం. ప్రజలకు బాబు చేస్తున్న దగాను వివరిస్తాం.

– జక్కంపూడి రాజా, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు

సీబీఎన్ అంటే చీటింగ్



చంద్రబాబు నాయుడు (సీబీఎస్) అంటే చీటింగ్, బాదుడు, నేరాలు. అబద్ధపు హామీలతో ప్రజలను చీట్ చేశారు. విద్యుత్ చార్జీలు, నిత్యావసరాల నిత్యావసరాలు, పెట్రోల్ ధరలు పెంచి ప్రజలపై భారం మోపారు. మహిళలపై అత్యాచారాలు, హత్యలతో నేరాలు పెరిగిపోయాయి. చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలు అన్నీ ఇచ్చేశామనగానే ప్రజలంతా అవాక్కయ్యారు. సోషల్ మీడియా, మీడియా ద్వారా చైతన్యమవుతున్నారు. ప్రతి ఒక్కరూ కూటమి ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.

– తానేటి వనిత, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్

ఆ సొమ్ము ఏ మూలకు?

- హేవలాక్ బ్రిడ్జి అభివృద్ధికి గతంలోనే రూ.400 కోట్లతో అంచనాలు
- ఇప్పుడు కేవలం రూ.94 కోట్లు తెచ్చి హడావుడా?
- అందులోనూ జీఎస్‌టీ పోనూ మిగిలేది రూ.77 కోట్లే
- ఆ డబ్బుతో ఏం చేస్తారు?
- మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ విమర్శ



మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన వాటికి ప్రారంభోత్సవాలు చేస్తూ కూటమి నాయకులు నానా హంగామా చేస్తున్నారని మాజీ ఎంపీ, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ విమర్శించారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మారినా ప్రభుత్వ కార్యక్రమాలు కొనసాగడం సహజమని, అయితే ఎవరు కృషి చేశారో కూడా గుర్తించాలని అన్నారు. 'దాదాపు 2.3 కిలోమీటర్ల పొడవైన హేవలాక్ వంతెన అభివృద్ధికి కనీసం రూ.400 కోట్లు ఖర్చవుతుందని గతంలోనే అంచనా వేయించాం. అటువంటిది ఇప్పుడు కేవలం రూ.94 కోట్లు తెచ్చి ఆ వంతెనకు రోడ్డు వేస్తామని, ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని కూటమి నాయకులు చెప్పడం వింతగా ఉంది. ఇందులో 18 శాతం జీఎస్‌టీ పోనూ రూ.77 కోట్ల వరకూ మాత్రమే మిగులుతుంది. ఆ డబ్బు ఏ మూలకు సరిపోతుంది?' అని భరత్‌రామ్ ప్రశ్నించారు. హేవలాక్ బ్రిడ్జి అభివృద్ధికి తన హయాంలో కృషి చేశానన్నారు. శివలింగం పక్కన, ఇటువైపు రైల్వే స్థలం కావడంతో ప్రత్యామ్నాయంగా 2,583.33 చదరపు మీటర్ల భూమిని వీఎల్ పురం లారీ స్టాండ్ వద్ద బదలాయించడానికి ఉత్తర్వులు తెచ్చామని గుర్తు చేశారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుంచి ఐఎల్‌టీడీ జంక్షన్ వరకూ రోడ్డు విస్తరణలో రైల్వే స్థలం పోతున్నందున ప్రత్యామ్నాయంగా వీఎల్ పురంలోనే స్థలం ఇచ్చామని చెప్పారు. అఖండ గోదావరి ప్రాజెక్టుకు 2015లోనే రూ.35 కోట్లు తెచ్చి ఏం చేశారో, ఎక్కడ ఖర్చు పెట్టారో తెలీకుండా ఉందన్నారు. ఈ ప్రాజెక్ట్‌లో కూటమి నాయకులు చెప్పేవన్నీ చేయాలంటే రూ.700 కోట్లు అవుతుందన్నారు. గజేంద్రసింగ్ షెకావత్ కేంద్ర జలశక్తి మంత్రిగా ఉండగా తన కృషి ఫలితంగా నగరంలో మురుగునీటి సమస్య పరిష్కారానికి రూ.88 కోట్లు మంజూరు చేశారని, ఆ నిధులతో మురుగు నీటిని మళ్లించే కార్యక్రమం చేపట్టకుండా సోకులు చేస్తే ప్రయోజనముండదని భరత్‌రామ్ హితవు పలికారు. రివర్ ఫ్రంట్‌కు రూ.22 కోట్లు కేటాయిస్తే, ఇప్పుడు రూ.8 కోట్లకు కుదించడం వింతగా ఉందన్నారు. తాను ఎంపీగా ఉండగా చేసిన కృషి ఫలితంగా సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఉప ప్రాంతీయ విజ్ఞాన కేంద్రాన్ని మంజూరు చేసిందని, ఆవిధంగా బొమ్మూరులో సైన్స్ సెంటర్ నిర్మాణానికి రూ.15.20 కోట్లు వచ్చాయని తెలిపారు. తమ హయాంలో పూర్తయిన మోరంపూడి ఫ్లైఓవర్, సైన్స్ సెంటర్‌ను కూటమి నాయకులు ప్రారంభించడం తప్పు కాదని, అయితే, దాని కోసం కృషి చేసిన వారిని కూడా గుర్తిస్తే గౌరవప్రదంగా ఉండేదని అన్నారు. తాను ఎంపీ లాడ్స్ నిధులు తీసుకొచ్చి గోదావరి గట్టున పూలే - అంబేడ్కర్ భవన్ నిర్మిస్తే, కూటమి నాయకులు హడావుడి చేస్తున్నారని అన్నారు. 'గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజమహేంద్రవరం మీద ప్రేమతో రూ.125 కోట్లు స్పెషల్ గ్రాంటు ఇచ్చారు. ఆ నిధులతో హ్యాపీ స్ట్రీట్, గోదావరి స్టేషన్ ఎక్సైజ్ కార్యాలయం వద్ద పుష్కర్ ప్లాజా, సుబ్రహ్మణ్య మైదానంలో ఓపెన్ ఎయిర్ యాంఫీ థియేటర్ నిర్మాణాలతో పాటు కంబాల చెరువు సుందరీకరణ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశాం' అని భరత్‌రామ్ గుర్తు చేశారు. అలాగే, నగరంలోని రాళ్లబండి సుబ్బారావు మ్యూజియం అభివృద్ధికి నిధులు తెచ్చి, చేపట్టిన కొత్త భవనం నిర్మాణం తుది దశకు చేరిందని చెప్పారు.

పేద పిల్లల చదువుకు.. ఆర్టీసీ తోడు

- బస్ పాస్‌ల జారీకి శ్రీకారం
- 12 ఏళ్లలోపు విద్యార్థులు, 18 ఏళ్ల లోపు విద్యార్థినులకు, దివ్యాంగులకు ఉచితం
- ఇతర ప్రయాణికులకు రాయితీ సౌకర్యం



రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పాస్‌లు అందజేస్తున్న సిబ్బంది

రాజమహేంద్రవరం సిటీ: పేద పిల్లల చదువులకు ప్రభుత్వ రంగంలోని ఏపీఎస్ ఆర్టీసీ తోడుగా నిలుస్తోంది. అర్హత ఉన్న వారికి ఉచితంగా, మిగిలిన వారికి రాయితీపై పాస్‌లు జారీ చేస్తోంది. వివిధ కేటగిరీల విద్యార్థులతో పాటు నిత్యం ప్రయాణించే వారికి కూడా రాయితీపై మంత్లీ సీజనల్ టికెట్లు (ఎంఎస్‌టీ) అందిస్తోంది. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభమవడంతో ఇప్పటికే ఈ ఉచిత బస్ పాస్‌లు జారీ చేస్తోంది. దీని కోసం జిల్లాలోని రాజమహేంద్రవరం, గోకవరం, నిడదవోలు, కొవ్వూరు ఆర్టీసీ బస్టాండ్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఉచితంతో పాటు రాయితీ, దివ్యాంగుల (పీహెచ్) పాస్‌లు కూడా జారీ చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా నాలుగు డిపోల పరిధిలో 2024-25 సంవత్సరంలో వివిధ రకాల పాసులు మొత్తం 75,606 అందించారు.

ఉచిత పాస్‌లు ఇలా..

పన్నెండేళ్ల లోపు విద్యార్థులు, 18 ఏళ్ల లోపు విద్యార్థినులు ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణించేందుకు పాస్‌లు మంజూరు చేస్తున్నారు. కావలసిన వారు విద్యార్థి ఫొటో, స్కూల్ యాజమాన్యం నుంచి ధ్రువీకరణ పత్రం సమర్పించి ఈ పాస్ పొందవచ్చు. ఆర్టీసీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని కౌంటర్ వద్దకు వెళ్తే వెంటనే ఉచిత పాస్ పొందవచ్చు. పాస్ పొందిన విద్యార్థులు తమ ఇంటి నుంచి పాఠశాల లేదా కళాశాలకు 20 కిలోమీటర్ల దూరం వరకూ ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణించవచ్చు.

దివ్యాంగులకూ ఉచితం

దివ్యాంగులకు మూడేళ్ల వ్యవధితో ఉచిత పాస్‌లు అందిస్తున్నారు. ఈ పాస్ పొందడానికి సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, అన్ ఎంప్లాయిమెంట్ సర్టిఫికెట్ సమర్పించాలి.

రాయితీపై..

నెల, మూడు నెలలు, ఏడాది కాలపరిమితితో రాయితీ బస్ పాస్‌లు మంజూరు చేస్తారు. కావాల్సిన వారు పాస్ ధరతో పాటు నెలవారీ గుర్తింపు కార్డుకు రూ.50, సర్వీస్ చార్జీ రూ.40 అదనంగా చెల్లించాలి. రాయితీతో పాటు సంవత్సరం గుర్తింపు కార్డు కావాల్సిన వారు రూ.100 చెల్లించాలి. గడువు ముగిశాక రెన్యువల్ కోసం స్కూల్ ప్రిన్సిపాల్/హెచ్ఎం సంతకం చేయించుకుని తిరిగి పొందాలి. సాధారణ విద్యార్థులకు జూన్ నుంచి ఏప్రిల్ వరకూ, ఐటీఐ, పారా మెడికల్ వంటి కోర్సులు చదివే వారికి మే నెల వరకూ పాస్‌లు మంజూరు చేస్తారు.

ప్రత్యేక కౌంటర్లు



కళాశాలలు, స్కూళ్లు ప్రారంభమైన నేపథ్యంలో కొత్త బస్ పాస్‌ల జారీకి చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే మంజూరు చేస్తున్నాం. కొత్త పాస్‌ల మంజూరు, పాతవి రెన్యువల్ చేసి, విద్యార్థులకు వేగంగా అందించేందుకు జిల్లాలోని నాలుగు బస్టాండ్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశాం.

– వై.సత్యనారాయణమూర్తి, జిల్లా ప్రజా రవాణా అధికారి, రాజమహేంద్రవరం

జిల్లాలో డిపోల వారీగా ఏపీఎస్ ఆర్టీసీ రెండేళ్లుగా జారీ చేస్తున్న బస్‌పాస్‌ల వివరాలు

డిపో	2023-24				2024-25			
	ఉచిత	రాయితీ	దివ్యాంగ	ఎంఎస్‌టీ	ఉచిత	రాయితీ	దివ్యాంగ	ఎంఎస్‌టీ
గోకవరం	797	7,423	415	1,318	1,963	7,492	311	1,486
కొవ్వూరు	389	5,333	199	957	368	4,766	144	800
నిడదవోలు	235	3,899	285	1,396	313	3,240	243	1,213
రాజమహేంద్రవరం	2,508	41,187	1,322	8,895	582	41,317	863	8,477

వందనానికి వంకలా!

- అంగన్‌వాడీల పిల్లలకు అందని పథకం
- ప్రభుత్వోద్యోగులుగా భావిస్తే ఆ ప్రయోజనాలు తమకూ కల్పించాలని డిమాండ్
- యాప్‌ల యాతనతో పనిభారం పెంచారు
- 42 రోజుల సమ్మె హామీల విస్మరణ
- కూటమి ప్రభుత్వంపై ఆ వర్గం నిప్పులు


ఫిబ్రవరి 17న కపిలేశ్వరపురంలోని ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు (ఫైల్)


వెదురుమూడిలో అంగన్‌వాడీ చిన్నారుల సంసిద్ధత కార్యక్రమంలో.. (ఫైల్)

కపిలేశ్వరపురం: ప్రభుత్వమంటే ప్రజలకు మేలు చేసేదయ్యుండాలి. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులందరికీ అమలు చేయాలి. కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఐదేళ్ల అధికారం ఇస్తే అందులో సామాజిక పింఛన్లు తప్ప మిగిలినవేవీ అమలుకు నోచుకోలేదు. ప్రజల ఒత్తిడి నేపథ్యంలో తల్లికి వందనం ప్రారంభించినప్పటికీ అనేక మంది అర్హులు సాయం అందక గగ్గోలు పెడుతున్నారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల వంటి వారిని విధానపరంగా సంక్షేమ పథకాలకు దూరం పెట్టడంతో చిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లలకు అన్యాయం చేయడానికి తామేం పాపం చేశామంటూ ఆందోళన చెందుతున్నారు. సంక్షేమ పథకాలు చిరుద్యోగులైన తమకు సైతం అమలు చేయాలన్న ప్రధాన డిమాండ్‌పై ఈ నెల 23న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. క్షేత్ర స్థాయిలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు సమాయత్తమవుతున్నారు.

సాంకేతికత పేరుతో పనిభారం

అనేక విభాగాల వారికి చేదోడువాదోడుగా ఉండే పనులకు వినియోగించుకోవాల్సిన అంగన్‌వాడీలపై సాంకేతికత పేరుతో కూటమి ప్రభుత్వం భారం మోపుతుంది. పోషకాహారాన్ని అందుకునే గర్భిణులు, బాలింతలు, చిన్నారుల వివరాలను ఫేస్ యాప్‌లో నమోదు చేయాల్సి రావడం భారంగా ఉందని, యాప్ యాతనను తొలగించాలంటూ కూటమి ప్రభుత్వాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరుతున్నారు. లబ్ధిదారుల వివరాలను నమోదు చేయడానికి పోషణ ట్రాకర్ యాప్, బాల సంజీవిని యాప్‌లను నిర్వహిస్తున్నారు. దీని ద్వారా 6 నెలలు నుంచి మూడేళ్ల లోపు పిల్లలకు పోషకాహారాన్ని అందిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు ఎఫ్ఆర్ఎస్ ద్వారా టేక్ హోమ్ రేషన్ (టీహెచ్ఆర్) అందిస్తున్నారు. ఆ రెండు యాప్‌లలో లబ్ధిదారుల వివరాలను నమోదు చేయడానికి అనేక సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. వాటితో పాటు అధికారులు మరో 12 రకాల రికార్డులు రాయిస్తున్నారు. ఏడు నెలల నుంచి ఆరేళ్ల లోపు చిన్నారుల తల్లిదండ్రులు, సంరక్షకుల ఫొటోలను తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. లబ్ధిదారుల ఆధార్ అప్‌డేట్ కాకపోయినా, ఈకేవైసీ కాకపోయినా, ఆధార్ కార్డులో లబ్ధిదారుని ఫోన్ నంబర్ అనుసంధానం కాకపోయినా వివరాలు యాప్‌లో నమోదు కావడంలేదు. అప్‌డేట్ వ్యవహారాలు సచివాలయానికి వెళ్లి సరిచేసుకోవాలని లబ్ధిదారులకు చెప్తున్నప్పటికీ వారు ఖాతరు చేయడంలేదు. దీంతో చేసేది లేక లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అంగన్‌వాడీలు పోషకాహారాన్ని అందించాల్సి వస్తోంది.

ఉద్యమాలపై ఉక్కుపాదం

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 42 రోజులు సమ్మె చేసిన సందర్భంగా తాము అధికారంలోకి రాగానే అంగన్‌వాడీల డిమాండ్లను పరిష్కరిస్తామని కూటమి నేతలు అప్పట్లో హామీ ఇచ్చారు. ఏడాది పాలనాకాలం గడిచినా హామీలో ప్రధానమైనదైన రూ.26 వేలకు జీతాలను పెంచాలన్న డిమాండ్‌ను పక్కన పెట్టారు. ఒక్క రూపాయి కూడా వేతనాన్ని పెంచలేదు. అంగన్‌వాడీ కార్యకర్త చనిపోయినప్పుడు రూ. 20 వేలు మట్టి ఖర్చులు ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఆచరణలో రూ.15 వేలు చెల్లించాలంటూ జీఓ జారీ చేశారు. రాష్ట్రంలోని 6,830 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయాలన్న డిమాండ్‌పైనా ఉలుకూ పలుకూ లేదు. ఇలాంటి నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు అనేకసార్లు ఆందోళన కార్యక్రమాలను చేపట్టారు. 2024 జూలై 10న కూటమి ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో వారు ర్యాలీలు నిర్వహించారు. ఈ ఏడాది మార్చి 10న ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఫిబ్రవరి 17న ఉమ్మడి జిల్లాలోని ఐసీడీఎస్ కార్యాలయాల వద్ద తమ డిమాండ్లను పరిష్కరించాలని ఆందోళనలు చేశారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో మార్చి 11న నిర్వహించిన చలో విజయవాడ ఆందోళనలో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి అంగన్‌వాడీలు పెద్ద ఎత్తున బయలుదేరారు. 10న సామర్లకోట, రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్లు, పలు బస్ స్టేషన్ల వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈనెల 23న ఉమ్మడి జిల్లాలోని కలెక్టర్ కార్యాలయాల వద్ద నిర్వహించిన ధర్నాను నిలువరించేందుకు ప్రభుత్వ యంత్రాంగం తీవ్ర ప్రయత్నం చేసి విఫలమైంది.

ఉమ్మడిజిల్లాలో అంగన్‌వాడీలు ఇలా...

కాకినాడ జిల్లాలోని 10 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,986 మెయిన్, మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా అందులో 1,05,996 మంది ప్రీస్కూల్ పిల్లలు, 11,610 మంది బాలింతలు, 10,573 మంది గర్భిణులకు అంగన్‌వాడీలు విశేష సేవలందిస్తున్నారు.

- కోనసీమ జిల్లాలోని 7 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,726 మెయిన్, మినీ అంగన్‌వాడీ కేంద్రాలుండగా 86,296 మంది చిన్నారులు, 15,743 మంది గర్భిణులు, బాలింతలకు సేవలందిస్తున్నారు.
- తూర్పుగోదావరి జిల్లాలో 7 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,536 మెయిన్, 26 మినీ మొత్తం 1,562 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులు సేవలందుకుంటున్నారు.

సంక్షేమ పథకాలకు దూరం చేయొద్దు



పెరుగుతున్న ధరలకు అనుగుణంగా, సుప్రీం కోర్టు చెప్పిన విధంగా కనీస వేతనాలను చెల్లించకుండా అంగన్‌వాడీలకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తోంది. ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తూ తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలకు అంగన్‌వాడీలను దూరం చేస్తోంది. అదే నిర్ణయాన్ని ప్రభుత్వం అమలు చేయదలిస్తే అంగన్‌వాడీలకు ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్న ప్రతి సదుపాయాన్ని కల్పించడంతో పాటు వేతనాలను పెంచాలి. ఆందోళనలు చేస్తున్నప్పుడు అప్రజాస్వామికంగా వ్యవహరిస్తే సహించేది లేదు.

– జి.బేబీరాణి, రాష్ట్ర అధ్యక్షురాలు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, కాకినాడ

వచ్చే నెల 2న జెడ్పీ సమావేశం

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జులై 2వ తేదీ ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనలకు లోబడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు విధిగా హాజరుకావాలని సీఈవో కోరారు.

ఆర్టీసీ ఏటీఎమ్ కిరణ్ కుమార్ బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ: ఆర్టీసీ పార్సిల్ కార్యాలయం అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్‌గా (కమర్షియల్) కిరణ్ కుమార్ శుక్రవారం రాజమహేంద్రవరంలో బాధ్యతలు చేపట్టారు. తుని డిపో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ మేరకు డీపీటీవో వైఎస్ఆర్ మూర్తి సారథ్యంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్‌గా పనిచేసిన మాధవ్ రాజమహేంద్రవరం డిపో మేనేజర్‌గా బదిలీ అయ్యారు. కాగా.. కిరణ్ కుమార్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లోని అన్ని ఆర్టీసీ డిపోలలో పార్శిల్ కార్యాలయాలను పర్యవేక్షించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో ర్యాలి వాసి మృతి

- కశింకోటలో ఘోర రోడ్డు ప్రమాదం
- ముందున్న లారీని ఢీకొట్టి ఘటన
- వ్యాన్ డ్రైవర్‌తో సహా మహిళ దుర్మరణం
- మరో మహిళకు గాయాలు


సత్యనారాయణ (ఫైల్)

కశింకోట: అనకాపల్లి జిల్లా కశింకోట మండలం జమాదులపాలెం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. శుక్రవారం వేకువజామున 2 గంటల ప్రాంతంలో హైదరాబాద్ నుంచి కోల్‌కతాకు వెళ్తున్న కంటైనర్‌ను బొలేరో వ్యాన్ ఢీకొంది. దాంతో వ్యాన్ డ్రైవర్ సహా ఒక మహిళ దుర్మరణం పాలయ్యారు. మరో మహిళ తీవ్రంగా గాయపడ్డారు. సీఐ అల్లు స్వామినాయుడు వివరాల ప్రకారం కశింకోట మండలం తీడ గ్రామానికి చెందిన పూల వ్యాపారి కన్నూరు లక్ష్మి(40)తో పాటు మరో మహిళ తూర్పు గోదావరి జిల్లా కడియం వద్ద పూలు కొనుగోలు చేసి గాజువాకలో విక్రయానికి వ్యాన్‌లో తరలిస్తున్నారు. ఈ క్రమంలో యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వస్తున్న ఈ వ్యాన్ అదే మార్గంలో ముందు వెళ్తూ అకస్మాత్తుగా ఆగిన కంటైనర్ లారీని బలంగా ఢీకొంది. దీంతో కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన వ్యాన్ డ్రైవర్ పి.సత్యనారాయణ (25), పూల వ్యాపారి లక్ష్మి(40) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. అనకాపల్లి మండలం కోడూరుకు చెందిన పూల వ్యాపారి ఎస్.వరలక్ష్మి తీవ్రంగా గాయపడింది. వెంటనే సీఐ స్వామినాయుడు, ఎస్ఐ లక్ష్మణరావులతోపాటు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వరలక్ష్మిని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సలహాపై విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.


కంటైనర్ లారీని ఢీకొన్న పూల లోడు వ్యాన్


వ్యాన్‌లో చిక్కుకున్న సత్యనారాయణ మృతదేహం

కేబిన్‌లో ఇరుక్కున్న మృతదేహాలు..

ఈ ఘటనలో వ్యాన్ క్యాబిన్ నుజ్జవడంతో అందులో డ్రైవర్, పక్క సీటులో కూర్చున్న లక్ష్మి మృత్యువాత పడ్డారు. పోలీసులు అతి కష్టం మీద వారిని బయటకు తీసి అనకాపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు.

జనావాసాల మధ్య సెల్ టవర్ వద్దు

సింగరాజుపాలెం ప్రజల అభ్యంతరం


సింగరాజుపాలెంలో సెల్ టవర్ నిర్మాణం వద్దని ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

దేవరపల్లి: జనావాసాల మధ్య సెల్ టవర్ నిర్మించవద్దని నల్లజర్ల మండలం సింగరాజుపాలెం ప్రజలు అభ్యంతరం తెలిపారు. టవర్ నిర్మిస్తున్న స్థలం వద్ద పలువురు గ్రామస్తులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ నిర్మాణం వల్ల ప్రమాదాలతో పాటు అనారోగ్యాలకు గురవుతామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ శివారున టవర్ నిర్మిస్తే ఇబ్బంది లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాలు నివశిస్తున్న కాలనీలో ఓ వ్యక్తికి చెందిన స్థలంలో గురువారం అర్ధరాత్రి టవర్ నిర్మాణానికి గోతులు తవ్వడం ప్రారంభించారని, ఈ విషయం తెలుసుకున్న పలువురు అక్కడకు చేరుకుని పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. 2018లో ఇదే ప్రాంతంలో సెల్‌టవర్ నిర్మాణ పనులు చేపట్టగా అప్పటి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లి నిలుపుదల చేసినట్టు గ్రామస్తులు తెలిపారు. పంచాయతీ అనుమతి లేకుండా మళ్లీ అర్ధరాత్రి పనులు చేస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బోయపాటి శేషు, గద్దే శ్రీనివాస్, వామిశెట్టి వెంకటేశ్వరరావు, అయినపర్తి చిన్న తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో ముగ్గురి అరెస్ట్

23 కిలోల సరకు, కారు స్వాధీనం

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామ పరిధిలోని వసంత నగర్ వద్ద గంజాయితో పట్టుబడిన ముగ్గురు యువకులను సర్పవరం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సీఐ పెద్దిరాజు తెలిపిన వివరాల మేరకు ఎస్సై పి.శ్రీనివాస్‌కుమార్, సిబ్బంది, డిప్యూటీ తహసీల్దార్ సమక్షంలో నిందితులు కాకినాడ అశోక్‌నగర్‌కు చెందిన చల్లా నాగ శివ మణికంఠ, మధురానగర్‌కు చెందిన మద్దాల ఉదయ్‌కుమార్, కాకినాడ రూరల్ గైగోలుపాడుకు చెందిన ఏనుగుపల్లి రాజులను పట్టుకుని వారి నుంచి 23కిలోల గంజాయి, స్విఫ్ట్ కారు స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. దారకొండ నుంచి గంజాయిని విక్రయానికి తీసుకువచ్చినట్టు నిందితులు అంగీకరించారని సీఐ తెలిపారు. నిందితులకు నేర చరిత్ర ఉందని గతంలో హత్య, దొంగతనాలు, ఇంటి చోరీలు, ఎన్‌డీపీఎస్ కేసులు కాకినాడ వన్ టౌన్, సర్పవరం, ఇంద్రపాలెం, పెద్దాపురం, తుని, అన్నవరం, కోటనందూరు, రాజానగరం, ద్రాక్షరామం పోలీసు స్టేషన్లలో ఉన్నాయన్నారు. వీరి క్రిమినల్ రికార్డుల పరిశీలనలో ఆర్గనైజ్డ్ క్రైమ్‌లో ఉండి నేరాలు చేస్తున్నట్టు స్పష్టమవుతోందని, వీరిపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 111(2)(బి)ను చేర్చామని తెలిపారు. నిందుతులు ముగ్గురిని న్యాయ స్థానంలో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు.

నన్నయలో పీజీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం


బ్రోచర్ విడుదల చేస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులు చేసేందుకు ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ తెలిపారు. శుక్రవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ఏపీపీజీ సెట్‌లో అర్హత పొందిన వారికి మాత్రమే ఈ అవకాశమని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి బ్రోచర్‌ని ఆమె విడుదల చేశారు. యూనివర్సిటీ క్యాంపస్‌తో పాటు తాడేపల్లిగూడెం, కాకినాడ క్యాంపస్‌లలో ఆర్ట్స్ అండ్ కామర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాలలో పీజీ కోర్సులు అందిస్తున్నామంటూ కోర్సుల వివరాలను తెలియజేశారు. ఇతర వివరాలకు 70930 08477 నంబర్‌కు ఫోన్ చేయడం, లేదా యూనివర్సిటీ వెబ్‌సైట్‌ని సందర్శించాలన్నారు.